క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ తెలిపారు. స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ రామ్‌కుమార్స్ షుగర్ కేర్ సెంటర్‌లో సాయంత్రం 6 గంటల నుంచి బీపీ, షుగర్, బాడీమాస్ ఇండెక్స్ (బీఎంఐ) పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఒబెసిటీ, థైరాయిడ్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన సదస్సు జరుగుతుందని, నగర ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

డిస్కం అధ్యక్షునిగా ఎన్నికైన దాసుబాబుకి సత్కారం



నగరంపాలెం: ఇటీవల ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీసీపీడీసీఎల్ డిస్కం అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లపాటి దాసుబాబుని వైఎస్సార్ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు గురువారం గుంటూరు విద్యుత్ భవన్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ సీనియర్ గణాంక అధికారి పి.రామిరెడ్డి, ఏఓ పి.వెంకటేశ్వర్లు, విజయభాస్కర్, అలి, కె.సారథి, రాయపాటి సీతారామయ్య పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

నెహ్రూనగర్: 18 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్సీలుగా కొనసాగుతున్న రజకుల్ని రాష్ట్రంలో కూడా ఆ జాబితాలో చేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని నేషనల్ దోభి మహా సంఘ్ కన్వీనర్ అన్నవరపు నాగమల్లేశ్వరరావు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు గురువారం పల్నాడు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎంను మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక మహిళలకు రక్షణ చట్టం కల్పించాలని, వృత్తి చెరువులపై శాశ్వత హక్కు కల్పించాలని కోరారు.

విగ్రహం తొలగింపు ఆలోచనే లేదు: మేయర్

నెహ్రూనగర్: రాజకీయ మనుగడ కోల్పోయిన కొందరు నేతలు ఉనికిని కాపాడుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, విగ్రహాల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం సమంజసం కాదని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. చుట్టుగుంట సెంటర్‌లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు కన్నెగంటి హనుమంతురావు విగ్రహాన్ని తొలగిస్తున్నారని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలపై ఆయన పై విధంగా స్పందించారు. సమరయోధులు, ప్రముఖ నాయకుల విగ్రహాలను గౌరవించి వాటిని కాపాడుకునే సంస్కృతి తమదని పేర్కొన్నారు. ప్రజలతో ఛీత్కరించబడి రాజకీయాల్లో తమ ఉనికిని చాటుకునేందుకు కొందరు ఇలాంటి నీచ రాజకీయాలకు తెరదీస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా వారిపై అప్రమత్తంగా ఉండాలని మేయర్ కోరారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



గుంటూరు మెడికల్: ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండటానికి కావల్సిన అవగాహన పొందే హక్కును కల్పించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కలపాల రత్నకుమార్ అన్నారు. గురువారం జీజీహెచ్ మానసిక వైద్య విభాగంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సులో జడ్జి రత్నకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం, మంచి నీటిని పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే బాధ్యత కలిగి ఉన్నప్పుడే ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం రోగులకు పండ్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికిరణ్, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, జిల్లా వివిధ ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా సీఎం

పట్నంబజారు: అక్కచెల్లెమ్మకు అండగా తాను న్నానే భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డెప్యూటీ మేయర్ షేక్ సజీల పేర్కొన్నారు. 7వ డివిజన్ కొత్తపేటలో సచివాలయంలో గురువారం వైఎస్సార్ ఆసరా నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ మాట్లాడుతూ మహిళలకు సీఎం చేయూతనందిస్తూ, అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా మాట్లాడుతూ మహిళా సాధికారిత సీఎం ద్వారానే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిటీ మిషనరీ మేనేజర్ ఆరిఫా సుల్తానా, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగత సుమాంజలి

చిలకలూరిపేటలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహరనాయుడు, టీచర్స్ ఎమ్మెల్సీ కల్పలత, జెడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి









చుట్టుగుంటకు మహర్దశ

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

పట్నంబజారు: గుంటూరు నగరంలోని కీలక కూడళ్లలో ఒకటైన చుట్టుగుంట జంక్షన్‌కు మహర్దశ పట్టిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఓవైపు అభివృద్ధి మరోవైపు ఆధ్యాత్మికం, ఓపక్క ఆటలు, మరోపక్క ఆహ్లాదంతో త్వరలో రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవనుందని చెప్పారు. శరవేగంగా జరుగుతున్న పనుల్ని గురువారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, స్థానిక కార్పొరేటర్ అడకా పద్మావతితో కలసి పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ లేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు సమగ్రాభివృద్ధి సాధనే తన సంకల్పమని తెలిపారు. చెన్నై, హైదరాబాద్‌ల నుంచి నగరంలోకి ప్రవేశించే చుట్టుగుంట జంక్షన్‌ను రాష్ట్రానికే ఒక రోల్ మోడల్‌లా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని నందనవనంలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. నియోజకవర్గంలో అత్యంత కీలకమైన ప్రాంతాల్లో ఒకటైన చుట్టగుంటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

నిరు పేదల దేశంగా మార్చిన ప్రధాని మోదీ

పాత గుంటూరు: ప్రధాని నరేంద్ర మోదీ తన తొమ్మిదేళ్ల పాలనలో దేశంలో తొమ్మిది కోట్ల మందిని కటిక పేదలుగా మార్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తగ్గితే భారత దేశంలో అధిక ధరలకు అమ్ముతున్నారని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా బ్యాంక్ లను మోసం చేసిన 27మంది గుజరాతీ మోసగాళ్లను విదేశాలకు పంపిన ఘనుడు మోదీ అని ఆరోపించారు. రాష్ట్రాల్ని దివాలా తీయించడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టును ఆపివేసి నిధులు మంజూరు చేయకుండా చేతులు దులుపుకొందని విమర్శించారు.

వైద్యసేవలు సామాన్యులకు చేరువ చేయాలి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ రాఘవశర్మ, డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: నానాటికి ఖరీదవుతున్న వైద్యసేవల్ని సామాన్యులకు చేరువ చేయాలనే లక్ష్యంతో సామాన్య వైద్యశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ, సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ పి.విజయ అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్సులో గురువారం ఫిజీషియన్ డాక్టర్ ఈదర ప్రజ్ఞాంజలి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యశాలను ముఖ్య అతిథులుగా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవశర్మ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఫిజీషియన్ల పాత్ర చాలా కీలకంగా మారిందని, అన్ని రకాల వ్యాధులకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఫిజీషియన్లు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు ఈదర కృష్ణమూర్తి, డాక్టర్ ప్రజ్ఞాంజలి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పూర్వ వైద్య విద్యార్థుల సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే ముస్తఫా



విరాళంగా ఇచ్చిన వైద్య పరికరాలతో ఎమ్మెల్యే ముస్తఫా, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు తమ మాతృ సంస్థకు చేస్తున్న సేవలను ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అన్నారు. గురువారం జీజీహెచ్‌లో సుమారు రూ. 75 లక్షలు విలువ చేసే వైద్య పరికరాలను గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థిని 1962 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ విజయలక్ష్మి అందజేశారు. ఆమె సమీప బంధువు బి.శ్రీనివాసరావు సదరు వైద్య పరికరాలను జీజీహెచ్ ఎనస్థీషియా వైద్య విభాగానికి ఎమ్మెల్యే ముస్తఫా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రోగి ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే వైద్య పరికరాలను అందజేసిన పూర్వ వైద్య విద్యార్థినికి కృతజ్ఞతలు తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ ఆపరేషన్‌ల సమయంలో సదరువైద్య పరికరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు మాతృ సంస్థను మరిచిపోకుండా వైద్య పరికరాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎనస్థీషియా వర్క్ స్టేషన్లు ఐదు, మానిటర్లు ఐదు, డిఫ్రిబిలేటర్లు, సిరంజి పంపులు రెండు అందజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకళ, ఎనస్థీషియా వైద్య విభాగాధిపతి డాక్టర్ విష్ణు మహేష్‌బాబు, ప్రొఫెసర్ డాక్టర్ కె.పోలయ్య, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ వి.నాగభూషణం, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టువర్టుపురంలో బజరంగ్ ఫౌండేషన్ సేవలు

సీఈఓ మురళీకృష్ణ



కొరిటెపాడు(గుంటూరు): సామాజికాభివృద్ధి, సుస్థిర ప్రగతి లక్ష్యాలుగా బజరంగ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గంలోని స్టువర్టుపురంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. బజరంగ్ జగన్మామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా గ్రామంలోని పేద, బడుగు, గిరిజన వర్గాలకు చెందిన మహిళలకు నారీ రుతువు కార్యక్రమం ద్వారా శానిటరీ నాప్ కిన్ల పంపిణీ, విద్యా విజేత కార్యక్రమం కింద గ్రామంలోని విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామంలోని వలంటీర్లకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం, రూ.5 లక్షల ప్రమాద బీమా బాండ్లను అందజేసే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సందడిగా గ్యాడ్యుయేషన్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో గురువారం కిండర్ కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే స్నాతకోత్సవం మాదిరిగా గౌన్లు, టోపీలు ధరించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ దంత వైద్య నిపుణుడు టి. హర్షవర్ధన్‌రెడ్డి చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, క్యాంపస్ ఇన్‌చార్జ్ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ



కొరిటెపాడు: భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యక్తిగత ప్రమాద బీమా ఒక కుటుంబానికి అండగా నిలిచిందని రీజినల్ మేనేజర్ ఎ.తారకేశ్వరరావు తెలిపారు. రూ. వెయ్యితో వ్యక్తిగత బీమా చెల్లించిన గుంటూరు నగరానికి చెందిన పెద్ది వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తూ మృతి చెందారని, ఆయన కుటుంబానికి అండగా స్టేట్‌బ్యాంకు రూ. 20 లక్షలు బీమా పరిహారాన్ని అందించినట్లు వెల్లడించారు. చెక్కును మృతుడి భార్య పెద్ది నాగరాజకుమారికి గురువారం బ్రాడీపేటలోని ఎస్‌బీఐ ట్రజరీ శాఖలో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఆనంద్, ఎం.మాధవ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట 2/3వ లైనులోని డాక్టర్ కొలచల వేంకట కృష్ణమూర్తి (కేవీకే) సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని శనివారం ఉదయం 9 గంటలకు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వహణ కమిటీ కన్వీనర్ కేఎస్ఎస్‌వీ ప్రసాదశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1958 నుంచి కళాశాలలో చదువుకుని దేశవిదేశాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడిన వారితో పాటు విశ్రాంత జీవితం గడుపుతున్న పండితులు సమావేశంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరుకానున్న అష్టావధాని బ్రహ్మశ్రీ ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన సంపూర్ణ సాహిత్య సంపుటి 'కొత్త గోదావరి' గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తమకు విద్య నేర్పిన గురువులందరినీ ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించనున్నామని, ఇతర వివరాలకు 94935 01306 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో మన్యుసూక్త హోమం



పాత గుంటూరు: కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీ హనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో గురువారం మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మే 13న హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మాలధారులకు 48 రోజులపాటు నిర్వహించే సద్ది ప్రారంభించారు. గత 37 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దీక్ష సమాజం కమిటీ సభ్యులు తిరువళ్లూరి వెంకట సుబ్బారావు, ఎస్. అనిల్ కుమార్, చాపల నాగేశ్వరరావు, పల్లంట్ల వంశీ ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు హనుమాన్ పాల్గొన్నారు

8న మాలల చైతన్య సదస్సు

నెహ్రూనగర్: రాష్ట్రంలోని మాలల ఐక్యతే ధ్యేయంగా ఈ నెల 8న అన్నవరంలో మాలల చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ తెలిపారు. అంబేద్కర్ భవన్‌లో గురువారం మాల సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలపై దాడులు అధికమవుతున్నాయని ఆరోపించారు. కోనసీమకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును వ్యతిరేకిస్తూ చేపట్టిన హింసలో మంత్రి, ఎమ్మెల్యే ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేసిన వారిపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయడాన్ని ఖండించారు. వివిధ కేసుల్లో ఎస్సీలపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ మాల సంఘాల నాయకులు గోదా జాన్‌పాల్, మల్లెల వెంకట్రావు, పంతగాని రమేష్, తుమ్మల ఫ్రాన్సిస్, బత్తుల వీరాస్వామి, ఈమని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై సమగ్ర అవగాహన అవసరం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రాయపాటి శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: న్యాయ విద్యార్థులకు దేశంలోని న్యాయ వ్యవస్థతో పాటు ప్రధానమైన చట్టాలపై సమగ్ర అవగాహన అవసరమని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సూచించారు. జేకేసీ కళాశాలరోడ్డులోని జేసీ లా కళాశాల 32వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదులకు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కీలకమని, వృత్తిలోకి ప్రవేశించే విద్యార్థులు వాగ్ధాటి కలిగి ఉండాలని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్ మాట్లాడుతూ ప్రతి వారం కళాశాలలో నిర్వహించే మూట్ కోర్టు పోటీలతో విద్యార్థి దశలోనే వాదనా పటిమ అలవడుతుందని తెలిపారు. విద్యార్థులంతా మూట్ కోర్టు పోటీల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన సూచించారు. కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి మాట్లాడుతూ కళాశాలలో పూర్తిస్థాయి ఆధునిక వసతులతో విద్యార్థులకు నాణ్యమైన న్యాయ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. సుధాకర్‌బాబు మాట్లాడుతూ 2020, 2023 సంవత్సరాల్లో జేసీ లా కళాశాల వేదికగా జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీల్ని విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యంతో రాణించేందుకు అవకాశాలు



విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్స్ మనోహర్, అనితాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడా నైపుణ్యంతో జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశాలు ఉంటాయని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, షటిల్ ఫైనల్స్, అథ్లెటిక్స్‌లో 100 మీటర్స్ రన్నింగ్, షార్ట్ పుట్ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల్ని వెలికి తీయడం కోసం ఏటా క్రీడా పోటీల్ని నిర్వహిస్తున్నామని వివరించారు. క్రీడలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, మనోస్థైర్యం, కష్టపడి పోరాడే తత్వం అలవడతాయని చెప్పారు. పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడా రంగాలలో రాణించాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ మీట్ నిర్వహించామన్నారు. ఆయా విభాగాల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారుల్ని గుర్తించి యూనివర్సిటీ స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని, తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో క్రీడల కమిటీ టీం డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, మేజర్ కుమార్‌రాజా, డాక్టర్ రవికుమార్, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్లో గురువారం ఎస్పీఎస్ బాస్కెట్ బాల్ అకాడమీ, హెచ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు వేసవిని సద్వినియోగం చేసుకునే విధంగా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించే రీతిలో ఇటువంటి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు దోహదపడతాయని అన్నారు. తమ పాఠశాల విద్యార్థులకే కాకుండా ఇతర పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఫౌండేషన్ కార్యదర్శి గుంటుపల్లి హరగోపాల్, బాస్కెట్ బాల్ కోచ్ రవి, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపతి పద్మజ పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు దోపిడీ

పట్నంబజారు: ఏటీఎం కార్డు మార్చి నగదు దోచుకున్న సంఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసవీనగర్‌లోని ఉండే తాడిశెట్టి వెంకటేశ్వరరావు తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కూలీలకు డబ్బులు ఇవ్వడానికి గానూ నగదు డ్రా చేయడానికి చుట్టుగుంటలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లాడు. కార్డు పెట్టి నగదు విత్‌డ్రా చేద్దామని చూసినప్పటికీ రాకపోవటంతో, పక్కనే మాస్క్ ధరించి ఉన్న ఒక వ్యక్తి సాయం చేసేందుకు వచ్చాడు. అతను ప్రయత్నించినప్పటికీ డబ్బులు రాకపోవడంతో వెంకటేశ్వరరావు వెనక్కి వచ్చేశాడు. అనంతరం రూ. 20వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో కార్డు పరిశీలించగా, మార్చినట్లు గుర్తించాడు. తన ఏటీఎం కార్డు కాకుండా మరో కార్డు ఇచ్చినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్‌లో మోసం

ఆన్‌లైన్‌లో నగదు అపహరించిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌కు చెందిన దూలాల కవిత ఫేస్‌బుక్‌లో ఒక ఉద్యోగానికి సంబంధించి లింక్‌ను నొక్కారు. ఈ క్రమంలో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను ఫోన్‌లో సంప్రదించారు. కవిత బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగిన క్రమంలో అన్ని వివరాలు వెల్లడించారు. అనంతరం 16 దఫాలుగా రూ.1.70 లక్షలు ఆమె అకౌంట్ నుంచి మాయమవ్వడంతో బాధితురాలు పోలీసుల్ని ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

